

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



## బాబూజీకి నివాళి



ఉమ్మడి రంగారెడ్డి వ్యాప్తంగా సోమవారం పలుచోట్ల జగ్జీవన్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు

## ఫుడ్ ఇండస్ట్రీస్‌లో బాలామృతం ప్లాంటుకు నేడు ప్రారంభోత్సవం

### హాజరుకానున్న సిఎం రేవంత్‌రెడ్డి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూలై 6, ప్రభాతవార్త :** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధి (నగరంలోని) లోని నాచారంలో గల తెలంగాణ ఫుడ్ ఇండస్ట్రీస్‌లో బాలామృతం ప్లాంటును రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి మంగళవారం మధ్యాహ్నం ప్రారంభించనున్నారు. జిల్లా పరిధిలో సిఎం రేవంత్‌రెడ్డి పర్యటన కార్యక్రమం ఉన్నందున జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. సోమవారం నాచారంలోని తెలంగాణ ఫుడ్ ఇండస్ట్రీస్‌లో సంబంధిత అధికారులు పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా పరిధి నగరంలోని నాచారంలో తెలంగాణ ఫుడ్ ఇండస్ట్రీస్‌లో బాలామృతం ప్లాంట్‌ను మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని సంబంధిత అధికారులు తెలిపారు.

# పర్మిట్ రూల్స్ అవుట్ మా మూళ్లు ఇన్!

**కుల్కచర్ల, జూలై 6 ప్రభాతవార్త:** కుల్కచర్ల మండల కేంద్రంలో పరిగి-మహబూబ్ నగర్ ప్రధాన రహదారి పక్కన వైన్స్ పర్మిట్ రూంల నిర్వహణలో నిబంధనలు పూర్తిగా గాల్లో కలిసిపోతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. పర్మిట్ రూం అనేది కేవలం 10-10 సైజ్ (వంద స్క్వేర్ మీటర్లు) విస్తీర్ణంలో మాత్రమే ఉండాలి. కానీ ఇక్కడ ఏకంగా 5 నుండి 10 గుంటల స్థలంలో, పెద్ద పెద్ద షెడ్లు వేసి భారీ ఎత్తున వ్యాపార సామ్రాజ్యాలను నడుపుతున్నారు. మద్యం ప్రియులు తాత్కాలికంగా నిలబడి తాగేందుకు మాత్రమే పర్మిట్ రూంలకు అనుమతి ఉంటుంది. అక్కడ కుర్చీలు, టేబుళ్ల వేయడానికి వీల్లేదు. కానీ కుల్కచర్లలో 20కి పైగా టేబుళ్ల వేసి, బార్ అండ్ రెస్టారెంట్ తరహాలో యథేచ్ఛగా కూర్చోబెట్టి మద్యం తాగిస్తున్నారు. పర్మిట్ రూంలలో కేవలం తాగునీరు, ప్యాకేజ్డ్ ఫుడ్ (చిప్స్, పల్లీలు) మాత్రమే అమ్మాలి. కానీ ఇక్కడ ఏకంగా వంట గదులు ఏర్పాటు చేసి వెజ్, నాన్‌వెజ్, చికెన్, మటన్ వంటి వంటకాలను విక్రయిస్తున్నారు. ఎటువంటి తనిఖీలు లేకపోవడంతో నాసిరకం ఆహారాన్ని అందిస్తూ మద్యం ప్రియుల ఆరోగ్యాలతో ఆడుకుంటున్నారు. నియమాల ప్రకారం 21 ఏళ్ల లోపు ఉన్న యువతీ యువకులను పర్మిట్ రూంలలోకి అనుమతించకూడదు. కానీ ఇక్కడ విద్యార్థులు, యువత వస్తే ప్రత్యేకంగా స్వాగతం పలుకుతూ వారి భవిష్యత్తును నాశనం చేస్తున్నారు. ఈ అక్రమ దందాల వెనుక ఎక్సైజ్ శాఖ అధికారుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. లిఖితపూర్వక ఫిర్యాదులు అందినప్పటికీ అధికారులు కన్నెత్తి చూడకపోవడం వెనుక ఈ అవినీతి తతంగమే కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కొక్క పర్మిట్ రూం నిర్వాహకుడి నుండి నెలకు రూ. 20 వేల నుండి రూ. 50 వేల వరకు మామూళ్ల అందుతున్నట్లు సమాచారం.



పరిగి -మహబూబ్ నగర్ ప్రధాన హైవే పక్కనే యథేచ్ఛగా సాగుతున్న అక్రమ సామ్రాజ్యం

కుల్కచర్లలో ఎక్సైజ్ అధికారుల కళ్ల ముందే అక్రమ దందా!
బార్‌ను తలపించేలా అనధికార పర్మిట్ రూమ్‌లు
వెజ్, నాన్‌వెజ్ వంటకాల విక్రయాలు
నాసిరకం ఫుడ్‌తో మందుబాబుల ప్రాణాలతో చెలగాటం
స్టూడెంట్స్ టార్గెట్‌గా సాగుతున్న అక్రమ వ్యాపారం
లిఖితపూర్వక ఫిర్యాదులు వచ్చినా స్పందించని అధికారులు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వెన్నెముక లేని వికలాంగులు

## హెల్పర్ ఉంటేనే మా మనుగడ

### ప్రజావాణిలో వికలాంగుల గోడు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూలై 6, ప్రభాతవార్త:** అత్యధికంగా అంగవైకల్యం కలిగి ఉన్న దివ్యాంగులను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆదుకోవాలని, జీవో ప్రకారం తమకు నెలకు 15 వేల రూపాయల పింఛన్‌తో పాటు వైద్య సేవలు అందించాలని మేడ్చల్ జిల్లాకు చెందిన పలువురు బాధితులు విజ్ఞప్తి చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి బాధితులు తరలివచ్చారు. కలెక్టర్ మనుచౌదరిని స్వయంగా కలిసి తమ ఆవేదనను విన్నవిస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. శరీరంలో సగం భాగం కిందికి పూర్తి స్పర్శ లేక, నడవలేని స్థితిలో ఉన్న తమకు ఐ నీడ్ సపోర్ట్ కింద ఒక హెల్పర్ ఉంటేనే జీవనం సాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. హెల్పర్‌ను ఏర్పాటు చేసుకోవడం కోసం ప్రభుత్వం జీవో జారీ చేసిందని, ఇతర రాష్ట్రాల్లో ఇలాంటి వారికి 15 వేల రూపాయల పింఛన్ ఇస్తున్నారని గుర్తు చేశారు. కలెక్టరేట్‌కు రావాలంటే వీల్‌చైర్లతో పాటు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందని, ఒక్కోసారికి సుమారు 2 వేల రూపాయల వరకు ఖర్చవుతుండటంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని కన్నీరు మున్నీరయ్యారు. సాధారణ దివ్యాంగుల మాదిరిగా కాకుండా, అత్యధిక అంగవైకల్యం ఉన్న తమను ప్రత్యేకంగా గుర్తించి జీవో ప్రకారం పింఛన్ పెంచాలని, ప్రభుత్వం తమకు వీల్‌చైర్లు కూడా ఇవ్వలేదని, స్వచ్ఛంద సంస్థలు ఇచ్చిన వాటిపైనే ఆధారపడుతున్నామని తెలిపారు.

**మూడు రోజుల్లో నిర్ణయం**

బాధితుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ మనుచౌదరి.. రెండు, మూడు రోజుల్లో సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ మనుచౌదరి, డిఆర్ మాలతి కలిసి మొత్తం 79 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఎలాంటి జాప్యం చేయకుండా, పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

# తాండూరులో చీటర్స్...

నిబంధనలకు విరుద్ధంగా చీటీల నిర్వహణ
అనధికార సంస్థలలో పెద్దఎత్తున మోసాలు
తాజాగా చేతులెత్తేసిన ఓ వ్యాపారి
మిత్రుల నుంచి లక్షల రూపాయలు వసూలు
కోటి రూపాయల మేర టోకరా
ఫోన్ స్విచ్ఛాఫ్.. ఇతర రాష్ట్రాలకు పరారీ
నట్టేట మునిగిన చందాదారులు

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** వికారాబాద్ జిల్లాలోని తాండూరు పట్టణం ప్రస్తుతం అడ్డగోలు చిట్ ఫండ్స్ దందాకు ప్రధాన వేదికగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా ప్రజల నుండి డిపాజిట్లు సేకరించడం, ఆ తర్వాత బోర్డు తిప్పేయడం ఇక్కడ పరిపాటిగా మారింది. గత ఇరవై యేళ్లుగా ఇక్కడ పెద్ద సంఖ్యలో వినియోగదారులను మోసం చేసిన ఎన్నో సంఘటనలు వెలుగు చూశాయి. ముఖ్యంగా ప్రభుత్వ గుర్తింపు లేని, రిజిష్టర్ కాని చిట్స్‌లోనే ఇలాంటి ఘోరాలు ఎక్కువగా జరుగుతున్నాయి. చందాదారులకు రూ.కోట్లల్లో చెల్లింపులు చేపట్టాల్సి ఉండగా, నిర్వాహకులు చేతులెత్తేసి దివాళా తీసినట్లు ప్రకటిస్తున్నారు. ఆపై వినియోగదారులకు డబ్బులు చెల్లించలేని స్థితిలో కోర్టులలో దివాళా ప్రక్రియ (ఇన్సాల్వెన్సీ పిటీషన్‌ఐపీ) దాఖలు చేస్తూ తప్పించుకుంటున్నారు. ఒకవేళ వీరి ఆస్తులను వేలం వేసినా, బాధితులకు కనీసం 20 శాతం కూడా చెల్లింపులు చేయలేని దయనీయ పరిస్థితులు ఎదురవుతున్నాయి. మరికొన్ని చిట్స్ నిర్వాహకులు కూడా ప్రస్తుతం చెల్లింపులు చేయలేని క్లిష్ట పరిస్థితిలో ఉన్నట్లు సమాచారం అందుతోంది.



ఇటీవల కాలంలో తాండూరు పట్టణంలోని మల్రెడ్డిపల్లి మార్గంలో ఓ స్థానికేతరుడు కొంతకాలంగా స్నేహం ముసుగులో వ్యాపారం ప్రారంభించాడు. తన చుట్టూ ఉన్న మిత్రుల నమ్మకాన్ని ఆసరాగా చేసుకొని, వారి వద్ద నుండి లక్షల రూపాయలు వసూలు చేసి చిట్స్ దందా నడిపాడు. చివరకు వారందరికీ కోటి రూపాయల మేర టోకరా వేసి రాత్రికి రాత్రే ఉడాయించడం స్థానికంగా పెద్ద చర్చనీయాంశమైంది. బాధితులు ఆయన కోసం ఎంత వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది, ఆయన ఫోన్ స్విచాఫ్ వస్తోందని, ఇతర రాష్ట్రాలకు పారిపోయాడని భావిస్తున్నారు. అయితే, ఇంత పెద్ద అన్యాయం జరిగినా బాధితులు పోలీసులను ఆశ్రయించకపోవడం ఇక్కడ గమనార్హం. ఇలాంటి మోసాలు ఎన్ని వెలుగుచూస్తున్నా వినియోగదారుల ప్రవర్తనలో మార్పు రావడం లేదు. సురక్షితమైన జాతీయ బ్యాంకులను నమ్మకుండా ప్రజలు ప్రైవేట్ చిట్స్ వైపు ఆకర్షితులవడానికి ప్రధాన కారణం పన్నుల భయమే. జాతీయ బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తే ఆదాయ పన్ను (ఇన్కమ్ టాక్స్) చెల్లించాల్సి వస్తుందని, అలాగే ఆస్తులు కొనుగోలు చేసినా ప్రభుత్వానికి లెక్కలు చూపించాల్సి వస్తుందని ప్రజలు భయపడుతున్నారు. దీనికి తోడు, ప్రైవేట్ చిట్స్‌లో ఎక్కువ లాభం వస్తుందని, ప్రతినెలా సభ్యులకు కమీషన్ అందుతుందనే ఆశతో కొంతమంది బడా చిట్స్‌లో సైతం డిపాజిట్లు చేస్తున్నారు. ఈ దందాల్లో స్థానిక వ్యాపారులతో పాటు కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు కూడా నిర్వాహకులుగా ఉంటూ, తమ సహచార ఉద్యోగులతో చిట్స్ వేయిస్తున్నారు. చివరకు వీరి మధ్య లావాదేవీల వ్యవహారంలో తేడాలు రావడంతో నిండా మునిగిపోతున్నారు.

**చట్టం ఏం చెబుతోంది?**

నిజానికి 1982 చిట్‌ఫండ్స్ చట్టం ప్రకారం.. చిట్ కంపెనీలు నిర్వహించేవారు తప్పనిసరిగా రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ వద్ద నమోదు చేసుకోవాలి. నిర్వాహకుడు ప్రతినెలా జరిగే వేలాన్ని పారదర్శకంగా నిర్వహించాల్సి ఉంటుంది.
ఈ లావాదేవీల్లో మోసాలకు అవకాశం లేకుండా చందాదారుల ప్రయోజనాలను కాపాడటానికి, నిర్వాహకులు చిట్ మొత్తానికి సరిపడా సెక్యూరిటీని రిజిస్ట్రార్ వద్ద డిపాజిట్ చేయాలనే నిబంధన ఉంది. అలాగే నిర్వాహకులు గరిష్టంగా 5 శాతం కమీషన్ తీసుకోవడానికి మాత్రమే అర్హులు. వేలంలో గరిష్టంగా చిట్ మొత్తంలో 40 శాతం వరకు మాత్రమే డిస్కౌంట్ (పాట) పాడటానికి చట్టం అనుమతిస్తుంది. కానీ వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. మార్కెట్లో 50 శాతం కంటే ఎక్కువ డిస్కౌంట్ తీసుకున్న సంస్థలు కోకొల్లలుగా ఉన్నాయి. ప్రతి చిట్ గ్రూపులో సభ్యుల సంఖ్యపై ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ, అవకతవకల నివారణకు లావాదేవీలను ఆన్లైన్ (ఈచిట్స్) ద్వారా నిర్వహించాలన్న నిబంధనలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ఫలితంగా నిబంధనల ఉల్లంఘనలు జరుగుతూ అమాయక ప్రజల సొమ్ము అక్రమార్కుల పాలవుతోంది.



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

## చెత్తశాలలు వద్దు

### పాఠశాలలే కావాలి...

డంపింగ్ యార్డుకు నిరసనగా విద్యార్థుల నినాదాలు

**కొత్తూరు, జూలై 6, ప్రభాతవార్త:** కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామంలో ప్రతిపాదిత డంపింగ్ యార్డు, ఎకోటౌన్ ప్రాజెక్టు, జీఓ నం. 641ను వ్యతిరేకిస్తూ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో సోమవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నాలో గ్రామస్థులు, మహిళలు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, సిద్ధాపూర్ ప్రజల న్యాయమైన డిమాండ్లకు తన పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. డంపింగ్ యార్డు, ఎకోటౌన్ ప్రాజెక్టు ప్రతిపాదనను ఉపసంహరించుకోవడంతో పాటు జీఓ నం. 641ను రద్దు చేసే వరకు తాను సిద్ధాపూర్ గ్రామంలోనే బస చేస్తూ ప్రజలతో కలిసి ఉద్యమాన్ని కొనసాగిస్తానని ప్రకటించారు. ప్రజల ఐక్యతే ఉద్యమ విజయానికి బలమని పేర్కొన్న ఆయన, రాబోయే రోజుల్లో చేపట్టనున్న ఉద్యమ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తమకు పాఠశాలలే కావాలి... చెత్తశాలలు వద్దని విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.

# సానుకూలంగా పరిశీలిస్తాం

### పరిశ్రమల ఏర్పాటులో భూసేకరణపై మంత్రి శ్రీధర్‌బాబు భరోసా

### స్థానిక యువతకే ప్రాధాన్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

**చేవెళ్ల, జులై 6, ప్రభాతవార్త :** ప్రజలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, పట్టణాల్లో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. రైతులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని పేర్కొంటూ, చేవెళ్ల ప్రాంత రైతులు పండ్లు, కూరగాయల ఉత్పత్తిలో విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. సోమవారం చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని శంకర్‌పల్లి, చేవెళ్ల, షాబాద్ మండలాల్లో మంత్రి సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా రూ. 16.96 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా షాబాద్ మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో మంత్రి మాట్లాడుతూ.. రైతులకు గిట్టుబాటు ధర లభించేలా ఆధునిక మార్కెటింగ్ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని, ఇబ్రహింపట్నంలో అంతర్జాతీయ ప్రమాణాలతో వ్యవసాయ మార్కెట్ నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. అదేవిధంగా, రంగారెడ్డి జిల్లాలో పరిశ్రమల స్థాపనకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, చందన్‌వెల్లి ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి రైతుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. పరిశ్రమల్లో స్థానిక యువతకే ప్రాధాన్యత కల్పించేలా చర్యలు తీసుకుంటామని, అలాగే రైతులకు డిఏపీ ఎరువుల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మంత్రి శ్రీధర్ బాబు మొదటగా శంకర్‌పల్లి మున్సిపాలిటీలో రూ.75 లక్షలతో బిడిఎల్ చౌరస్తా వద్ద సుందరీకరణ పనులను, రూ.55 లక్షలతో కొనుగోలు చేసిన సక్షన్ జెట్టింగ్ మిషన్‌ను ప్రారంభించారు. అనంతరం చేవెళ్ల మండలం ఈర్లపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, రూ.20 లక్షల సీసీ రోడ్డు, స్ట్రీట్ లైట్స్ పనులను ప్రారంభించారు. శంకర్‌పల్లి చౌరస్తా వద్ద రూ.2 కోట్లతో జంక్షన్ డెవలప్‌మెంట్ పనులకు, అంగన్బజార్‌లో రూ.24 లక్షలతో సీసీ రోడ్డుకు, పామెన గ్రామంలో రూ.25 లక్షలతో బీజీ రోడ్డుకు శంకుస్థాపనలు చేశారు. ముడిమ్యాల గ్రామంలో రూ.10 లక్షలతో డ్వాక్రా భవనం, రూ.12 లక్షలతో అంగన్వాడి భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేసి, రూ.65 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, స్ట్రీట్ లైట్లను ప్రారంభించారు.
షాబాద్ మండలంలో మంత్రి భారీగా నిధులు కేటాయిస్తూ శంకుస్థాపనలు చేశారు. సర్దార్ నగర్ మార్కెట్ యార్డులో రూ.2.97 కోట్లతో పలు అభివృద్ధి పనులకు, అస్పల్లిగూడ గ్రామం నుండి గొల్లబస్తీ వరకు రూ.4.10 కోట్లతో నిర్మించనున్న రోడ్డుకు, రూ.5 కోట్లతో షాబాద్ షాద్నగర్ పిడబ్ల్యు రోడ్డు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అలాగే షాబాద్ మండల కేంద్రంలో రూ.55 లక్షల అభివృద్ధి పనులకు, మల్లారెడ్డిగూడలో రూ.25 లక్షల సీసీ రోడ్డు, స్ట్రీట్ లైట్స్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పర్యటనలో మంత్రి వెంట రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్మయి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, ముడిమ్యాల సహకార సంఘం చైర్మన్ ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భూ నిర్వాసితులకు సరైన నష్టపరిహారం ఇవ్వాలి

### మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి డిమాండ్

**కందుకూరు. జూలై 6. ప్రభాతవార్త:** అభివృద్ధి పేరుతో రైతుల వద్ద నుండి భూములను తీసుకుంటే న్యాయమైన నష్టపరిహారాన్ని అందించాలని మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యులు మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కందుకూరు మండలం సార్లరావుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పోతు బండ తండా, మంగలి గడ్డ తండా లలో భూములు కోల్పోయిన రైతులు నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబితా రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమం గురించి భూములు ఇవ్వడానికి రైతులు అంగీకరించిన తగిన నష్టపరిహారం ఇవ్వడం లేదని దాని ద్వారా నిరుపేద రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆందోళన కార్యక్రమాలు దీక్షలు నిర్వహిస్తున్న ప్రభుత్వం వారి కష్టాన్ని గుర్తించడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భూ నిర్వాసితులకు న్యాయమైన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాక మొదలు కాంగ్రెస్ పార్టీ ఈ ప్రాంతంలో ఫార్మాసిటీ కోసం తీసుకున్న భూములను తిరిగి రైతులకు అప్పగిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను మోసం చేస్తుందని విమర్శించారు. నేడు ఫోర్త్ సిటీ పేరుతో రైతుల వద్ద నుండి భూములను చౌకగా తీసుకుంటూ రైతులకు అన్యాయం చేస్తుందని ఇది పేదల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు వెంకటేష్ నాయక్, నీలం శ్రీవిద్య, మేఘనాథ్ రెడ్డితో పాటు మాజీ సర్పంచులు ప్రవీణ్ నాయక్ గోవర్ధన్ నాయక్ మన్నే జయేందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా

## బాధితులకు దిక్సూచిలా భరోసా కేంద్రం

### ప్రత్యేక సమన్వయ సమావేశంలో ఎస్పీ స్నేహామెహ్రా

**వికారాబాద్, ప్రభాతవార్త :** లైంగిక వేధింపులు, గృహ హింస, పోక్సో చట్టం పరిధిలోకి వచ్చే కేసుల్లో బాధితులకు భరోసా కేంద్రాల ద్వారా తక్షణ సహాయం, రక్షణ, న్యాయం అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ స్నేహామెహ్రా ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో భరోసా టీం, సంబంధిత అధికారులతో ప్రత్యేక సమన్వయ సమావేశాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, బాధితులకు కేవలం చట్టపరమైన సహాయమే కాకుండా, వారికి అవసరమైన వైద్య సేవలు, కౌన్సిలింగ్, పునరావాసం కల్పించడంలో అన్ని విభాగాలు సమన్వయంతో ముందుకు సాగాలని ఆమె స్పష్టం చేశారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నేరస్థులకు తగిన శిక్ష పడేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. బాధితుల్లో ధైర్యాన్ని నింపేందుకు భరోసా కేంద్రం ఒక దిక్సూచిలా పనిచేయాలని ఆమె అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూ, ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూడటమే మన ప్రాధాన్యత కావాలని ఎస్పీ తెలిపారు.
ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, డీసీఆర్‌బీ డీఎస్పీ జానయ్య, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, పరిగి, మోమిన్‌పేట్, ధారూర్, కొడంగల్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు, ఏహెచ్‌టీయూ (తిబీగిగి) ఇన్స్పెక్టర్ ఎస్.కె. అన్వర్ పాషా, భరోసా సెంటర్ ఇంచార్జి శ్వేత, సిడబ్ల్యూసి చైర్‌పర్సన్ వెంకటేశం, సభ్యులు ప్రకాష్, డిఎల్ఎస్ఎ సభ్యులు వెంకటేశం, డిసిపియు ఇంచార్జ్ శ్రీకాంత్, షఫీ, చైల్డ్ లైన్ రాజు నాయక్, లీగల్ సెల్ నరేష్ కుమార్, సఖి సెంటర్ ఇంచార్జి యశోద, సాధన ఎన్జీవో నర్సింలు, గౌరీ, ఎడ్యుకేషన్ జిసిడివో శ్రీదేవి, డాక్టర్ నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

### ఫిర్యాదుల పరిష్కారానికి

## డెడ్‌లైన్

### -జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ



**వికారాబాద్, ప్రభాతవార్త :** ప్రజావాణి ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలని జల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. ప్రభుత్వం ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం సోమవారం కలెక్టరేట్ సమావేశం హాలులో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వినతులు, ఫిర్యాదులు, సమస్యలకు సంబంధించిన 152 దరఖాస్తులను స్వీకరించారు. ప్రజల నుండి అందిన వినతులను స్వీకరించి, వాటిని సంబంధిత శాఖలకు పంపిస్తూ నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రజల సమ స్యలను పెండింగ్ ఉంచకుండా పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కరించాలని, ప్రతి వినతిని పరిశీలించి అర్హత మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

## రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం

**శంషాబాద్, జులై 6 ప్రభాతవార్త:** ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. కాకినాడ జిల్లా పెదపూడి మండలం కైకవోలు గ్రామానికి చెందిన చల్లా మనోహర్ (25) హైదరాబాద్‌లోని కిస్మత్పూర్ రోడ్డులో నివసిస్తూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. రామచంద్రపురం మండలం ఎరుపల్లిలో జరిగిన తమ కుటుంబ నిశ్చితార్థ వేడుకకు వెళ్లి, ఆదివారం సాయంత్రం తిరిగి కారులో హైదరాబాద్‌కు బయలుదేరారు. సోమవారం తెల్లవారుజామున పెద్దగోల్కొండ సమీపంలోని ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెం. 15 వద్ద వీరు ప్రయాణిస్తున్న కారు వెళ్తుండగా, ముందు వెళ్తున్న ఒక గుర్తుతెలియని లారీ అకస్మాత్తుగా స్లో అయింది. దీంతో కారు నడుపుతున్న రాఘవేంద్రప్రసాద్ వాహనాన్ని అదుపు చేయలేక లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. కారు ముందు సీట్లో కూర్చున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చల్లా మనోహర్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. వెనుక సీట్లో కూర్చున్న భవాని అనే మహిళకు ముఖం, పొట్ట భాగంలో బలమైన గాయాలయ్యాయి. ఆమెను మొదట శంషాబాద్ ఆసుపత్రికి, ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం గచ్చిబౌలిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కారులో ఉన్న రెండేళ్ల చిన్నారి కూడా ఈ ప్రమాదంలో గాయపడినట్లు పోలీసులు తెలిపారు.

# జగ్‌జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషిచేయాలి


బాబు జగ్‌జీవన్‌రామ్‌కు నివాళులు అర్పిస్తున్న నాయకులు

**పెద్దేముల్, జులై 6, ప్రభాతవార్త:** భారత మాజీ ఉప ప్రధాని డా.బాబు జగ్‌జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరు కృషిచేయాలని యంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు కె.మల్లికార్జున్ అన్నారు. సోమవారం పెద్దేముల్ మండలం జనగాంలో గ్రామ అధ్యక్షులు టి.రాజు అధ్వర్యంలో బాబు జగ్‌జీవన్‌రామ్ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా యంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు మల్లికార్జున్, యంఎస్‌పి జిల్లా ప్రదాన కార్యదర్శి స్వామిదాసు మాట్లాడుతూ బాబు జగ్‌జీవన్‌రామ్ ఈ దేశానికి 52 సంవత్సరాలు పార్లమెంటు సభ్యులుగా, 30 సంవత్సరాలుగా వివిధ శాఖల్లో కేంద్ర మంత్రిగా అనేక సేవలు అందించారని గుర్తుచేశారు. అలాంటి నాయకుని అడుగు జాడలలో ప్రతి ఒక్కరు నడవవలసిన అవసరం ఎంతైన ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సిములు, సంజీవ్, కర్రె మల్లేశం, కుంటిగల్ల అంతప్ప, శివకుమార్, ఎస్.రాములు, పట్నం లాజర్, టి.దేవప్ప, పెంటప్ప, బాలప్ప, చిన్నబాలప్ప, రమేష్, యాదప్ప, సారా శంకర్, జి.నర్సులు, శాంతుకుమార్, లాజర్, ఎల్లప్ప, అనిల్, చిన్న శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాల సాధనకు కట్టుబడి పనిచేస్తాం


శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బిజెపి నాయకులు

**కొత్తూరు,జులై 6, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలకు బలమైన పునాది వేసిన గొప్ప జాతీయవాది డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి వేడుకలను సోమవారం కొత్తూరు మున్సిపాలిటీ కేంద్రంలో కొత్తూరు మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు అమడాపురం రణధీర్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమడాపురం రణధీర్ గౌడ్ మాట్లాడుతూ, దేశ సమగ్రత, జాతీయ ఏకత్వం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. దేశంలో ఒకే రాజ్యాంగం, ఒకే జెండా, ఒకే ప్రధానత్వం ఉండాలనే లక్ష్యంతో ఆయన నిరంతరం ఉద్యమించారని పేర్కొన్నారు.

జాతీయవాద భావజాలాన్ని బలోపేతం చేస్తూ దేశ ప్రయోజనాల కోసం అహర్నిశలు కృషి చేసిన మహోన్నత నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. డా. ముఖర్జీ చూపిన దేశభక్తి, సేవా స్ఫూర్తిని ప్రతి బీజేపీ కార్యకర్త ఆదర్శంగా తీసుకుని ప్రజాసేవలో ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం నాయకులు ముఖర్జీ జీవిత విశేషాలను స్మరించుకుని ఆయన ఆశయాల సాధనకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

ఈ కార్యక్రమంలో కొత్తూరు మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి కోస్గి మల్లేష్ ,నాగనీ సురేందర్,ఉపాధ్యక్షులు వడ్ల ప్రభాకర్ ,ఏనుగు విజయభాస్కర్ రెడ్డి ,యువమోర్చా మున్సిపాలిటీ అధ్యక్షులు మైలారం శ్రీశైలం ,ఏనుగు రాఘవేందర్ రెడ్డి ,కొత్తూరు మండల ప్రధాన కార్యదర్శి గొడుగు గణేష్ ,వనం శ్రీను,బిజెపి నాయకులు గట్టు శివలింగం ,బిజెపి సీనియర్ నాయకులు పిట్టల శేఖర్ ,శ్రీశైలమప్ప అరవింద్ మిత్ర బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దేశ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళులు



**బంట్వారం, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ చౌరస్తా వద్ద యూత్ అధ్యక్షుడు దొరేటి సుధాకర్ ఆధ్వర్యంలో బాబు జగ్జీ వన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివా ళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల నాయకుడు, శ్రామిక వర్గాలకు, కర్షకులకు దేశ ప్రజలందరికీ సంక్షేమాన్ని అందించడానికి ఎంతో కృషిచేసిన మహా నాయకుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. అట్టడుగు వర్గాల నుంచి భారతదేశ ఉప ప్రధానిగా ఎదిగి దేశ ప్రజలందరి చేత మన్ననలు పొందిన మేధావి జగ్జీవన్ రామ్ అని అన్నారు ఆయన అడుగుజాడల్లో నడవడం మనందరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్జీవన్ రామ్ యూత్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడు దొరేటి సుధాకర్, దళిత సంఘాల నాయకులు, యువజన సంఘ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కంకల్ గ్రామాన్ని సందర్శించిన పురావస్తు శాఖ అధికారులు


పూడూరు మండలం కంకల్ గ్రామంలో పురావస్తు విగ్రహాలు,శాసనాలను పరిశీలిస్తున్న ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సభ్యులు,తదితరులు

**పూడూరు, జులై 6, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధిలోని కంకల్ గ్రామాన్ని సోమవారం పురావస్తు శాఖకు చెందిన ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సభ్యులు సందర్శించారు. గ్రామంలోని శ్రీ వీరభద్రేశ్వరాలయం ఆవరణలో ఉన్న పురాతన విగ్రహాలు, శాసనాలు,పరిసరాలను పరిశీలించారు .ఈ సందర్భంగా గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు గ్రామంలో గ్రామ చరిత్రను తెలిపే విధంగా మన ఊరు,మనచరిత్ర బోర్డును ఏర్పాటు చేసేందుకు సానుకూలత వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సభ్యులు సనాతన్, జితేందర్,శశాంక్,గోపి,గ్రామస్తులు రవీందర్, సుధాకర్, బాలయ్య,అనంతయ్య,ఉపాధ్యాయులు చిన్నికృష్ణ, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఘట్‌కేసర్‌లో బాబుజగ్జీవన్‌రాంకు నివాళులు అర్పిస్తున్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్, కాంగ్రెస్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి

# బాబుజగ్జీవన్‌రాం సేవలు చిరస్మరణీయం

**ఘట్‌కేసర్, జులై 6, ప్రభాతవార్త:** అట్టడుగు వర్గాల ప్రజల సంక్షేమానికి జగ్జీవన్‌రాం అందించిన సేవలు చిరస్మరణీయమని ఘట్‌కేసర్ డివిజన్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్‌లో సోమవారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కడుపొల్ల మల్లేశ్ ఆధ్వర్యంలో మాజీ ఉపప్రధానమంత్రి స్వర్గీయ బాబుజగ్జీవన్‌రాం 40వ వర్ధంతి నిర్వహించారు. ఘట్‌కేసర్ డివిజన్ యంనంపేట్ చౌరస్తా డానో కంపెనీ ఎదురుగా ఉన్న బాబుజగ్జీవన్‌రాం విగ్రహానికి మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పూలదండలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దేశంలో హరితవిప్లవం, భారతదేశ వ్యవసాయాన్ని ఆధునీకరించడంలో కేంద్ర వ్యవసాయమంత్రిగా జగ్జీవన్‌రాం 1974లో కరవు సమయంలో ఆహార సంక్షోభాన్ని నివారించడంలో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. దళిత జాతి అభ్యున్నతికి జగ్జీవన్‌రాం ఎంతగానో కృషి చేశారని ఆయన ఆశయ సాధనలకు కృషి చేయాలని వారు సూచించారు. ఈకార్యక్రమంలో ఆర్‌బిఎస్ మాజీ సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, ఎంఆర్‌పిఎస్ నేత మీసాల మల్లేశ్, మాజీ కౌన్సిలర్ కడుపొల్ల మల్లేశ్, మాజీ వార్డుసభ్యులు మామిండ్ల చిత్తారియాదవ్, మీసాల సుధాకర్‌రావు, నాయకులు బర్ల రాధాకృష్ణ, కొరుబోతు నాగరాజు, మొత్కుపల్లి శ్రీనివాస్, మేకల సునీల్‌కుమార్, కడపొల్ల రాజు, సుధాకర్, రాజేశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**...లింగాపూర్‌లో...**

**సమానత్వం కోసం జగ్జీవన్‌రాం కృషి: మహేశ్‌గౌడ్**

**ఘట్‌కేసర్, జులై 6, ప్రభాతవార్త:** అంటరానివారి సమానత్వం కోసం ఆల్‌ఇండియా డిప్రెస్డ్‌క్లాసెస్ లీగ్ అనే సంస్థను స్థాపించిన మహనీయుడు బాబుజగ్జీవన్‌రాం అని కాంగ్రెస్‌పార్టీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్ అన్నారు. ఎదులాబాద్ డివిజన్ లింగాపూర్‌లో సోమవారం మాజీ ఉపప్రధాని స్వర్గీయ బాబుజగ్జీవన్‌రాం 40వ వర్ధంతిని నిర్వహించారు. లింగపురం గ్రామ నవచైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన బాబు జగ్జీవన్‌రాం వర్ధంతి కార్యక్రమంలో వేముల మహేశ్‌గౌడ్ విచ్చేసి జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచులు నానావత్ రూప్‌సింగ్‌నాయక్, బద్దం గోపాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ వేముల పరమేశ్‌గౌడ్, మాజీ వార్డుసభ్యులు గుర్జకుంట నర్సింహ్మా, బావండ్లపల్లి సదానందం, శ్రీను, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీకి బిజెపి నాయకుల ఘన నివాళి


మేడ్చల్‌లో శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన బీజేపీ నేతలు

**మేడ్చల్, జులై 6, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ సిద్ధాంతకర్త, జాతీయ సమైక్యత కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానేత డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను మేడ్చల్‌లో మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

అనంతరం శైలజ హరినాథ్, ఎల్లంపేట మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు గౌరారం జగన్ గౌడ్‌లు మాట్లాడుతూ, శ్యామ ప్రసాద్ ముఖర్జీ దేశ సమైక్యత, జాతీయ సమగ్రత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన దేశభక్తుడని కొనియాడారు. "ఏక్ దేశ్ మే దో విధాన్, దో నిశాన్, దో ప్రధాన్ నహీ చలేగా" అనే నినాదంతో దేశ ఐక్యత కోసం అలుపెరగని పోరాటం చేశారని, జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని వ్యతిరేకిస్తూ దేశ సమగ్రత కోసం తన ప్రాణాలను సైతం అర్పించిన మహనీయుడని గుర్తు చేశారు. ఆయన ఆశయాలు ప్రతి భారతీయుడికి ఆదర్శమని, యువత దేశభక్తి, సేవాభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నందా రెడ్డి, మేడ్చల్ రూరల్ జిల్లా కోశాధికారి లవంగ శ్రీకాంత్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు రాగం అర్జున్, బీజేవైఎం జిల్లా నాయకుడు బొజ్జ రాఘవ రెడ్డి, ఎల్లంపేట మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి మహేష్, మేడ్చల్ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి కానుకంటి వంశీ విజయ్ వంజరి, జకట ప్రేందాసు, ఉపాధ్యక్షులు మైసరి రాజు వంజరి, సర్వేశ్వర రెడ్డి, కార్యదర్శులు డి. సాయి, బండి విష్ణు, సీనియర్ నాయకుడు ధాత్రిక లక్ష్మణ్ వంజరి, యువ నాయకుడు శ్రీనివాస్, మహిళా మోర్చ నాయకులు పుష్ప మల్లారెడ్డి, తోట అనిత, నాయకులు సాదామణి నరేందర్, ఎన్.ఎస్. గౌడ్, రతన్ రాథోడ్, బొజ్జ వంశీ రెడ్డి, అర్జున్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## జగ్జీవన్ రామ్‌కు నివాళి

**మేడ్చల్, జులై 6, ప్రభాతవార్త:** మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆయనకు మేడ్చల్‌లో నాయకులు ఆత్మీయ ఘననివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు సమర్పించారు.

# మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగించాలి



**కడ్తాల్, జులై 6, ప్రభాతవార్త:** బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు మాధారం గణేష్ గౌడ్ గారి మరియు సంఘం నాయకుల ఆధ్వర్యంలో కడ్తాల్ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులుగా నియమించిన ఎం.డి. ఆసిఫ్ అలీని శాలువా తో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక అభి నందనలు తెలిపారు. అనంతరం మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ ఈ నియామకం ఆయన ప్రజాసేవకు, సమాజం పట్ల ఉన్న నిబద్ధతకు లభించిన గౌరవమని పేర్కొన్నారు. ఎం.డి. ఆసిఫ్ అలీ గారి అనుభవం, ప్రజా సమస్యలపై ఉన్న అవగాహన తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి, ముఖ్యంగా వెనుకబడిన వర్గాల సంక్షేమానికి ఎంతో ఉపయోగపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పగిం చిన బాధ్యతలను ఆయన సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సేవలందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులుగా బాధ్యతతో చేపట్టిన ఎం.డి. ఆసిఫ్ ప్రజలకు మరింత చేరువై రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను ప్రజల్లో మరింత విస్తృతంగా చాటిచెప్పాలని, సామాజిక న్యాయం, సమానత్వం, విద్యాభివృద్ధి కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ సర్పంచ్ రాయికంటి బిక్షపతి, ఉపసర్పంచ్ యాదగిరి రెడ్డి, వార్డు సభ్యులు ఎర్రోళ్ల రాఘవేందర్, భానుకిరణ్, మంకీ మహేష్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు తిరుమలేష్, జాంగీర్ అలీ, మలే మల్లేష్ గౌడ్, సత్యం యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# నందిగామలో ఘనంగా డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి


డాక్టర్ శ్యామ్ ముఖర్జీ జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు.

**నందిగామ ,జులై 6, ప్రభాతవార్త:** జాతీయవాద సిద్ధాంతకర్త, , గొప్ప మేధావి శ్రీ శ్యామ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి వేడుకలను (మై భారత్) రంగారెడ్డి జిల్లా దాసరి శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగింది.ఈ కార్యక్రమంలో నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, స్థానిక ఎస్సై దేవరాజ్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సుధాకర్ , ఉప సర్పంచ్ ఎర్ర వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దేపల్లె కుమార్ గౌడ్‌లు శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వ్యాసరచన. ఉపన్యాస చిత్రలేఖనం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు. ప్రశంసా పత్రాలను అందజేశారు. ఎస్సై దేవరాజ్ విద్యార్థులతో మాదకద్రవ్యాల రహిత సమాజాన్ని మార్చడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు.. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు. ఎంసి డైరెక్టర్ సి నర్సింలు ,పంచాయతీ కార్యదర్శి రాజు. యువ మోర్చనాయకుడు ప్రవీణ్ గౌడ్. మై భారత్ వాలంటీర్లు శ్రీను. కుమార్. అనీల్. అఖిల్ ఉపాధ్యాయులు విద్యార్థులు , యువకులు తదితరులు పాల్గొన్నారు.

# బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్



**శామీర్‌పేట, జులై 6, ప్రభాతవార్త:** దేవరయాంజాల్‌లో మాజీ ఉపప్రధాని దివంగత నేత బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్ 41వ వర్ధంతి సందర్భంగా పలువురు ఎంఆర్‌పిఎస్ నాయకులు నివాళులు అర్పించారు. ఎంఆర్‌పిఎస్ జాతీయ కళామండలి అధ్యక్షులు ఎస్.వై.అశోక్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు. సోమవారం శామీర్‌పేట డివిజన్ పరిధిలోని దేవరయాంజాల్‌లో బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని పలువురు నాయకులు పాల్గొని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాబుజగ్జీవన్‌రామ్ చేసిన సేవలను పలువురు నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు బంగరుగల్ల శంకర్, నాయకులు చంద్రశేఖర్, హరికృష్ణ, మహేందర్, నర్సింగ్‌రావు, ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దేవరయాంజాల్‌లోని బాబుజగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఎంఆర్‌పిఎస్ నాయకులు, స్థానిక పలువురు నాయకుల, తదితరుల దృశ్యం

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడ్ని సన్మానించిన ఎంపి మల్లు రవి

**తలకొండపల్లి జూన్ 6, ప్రభాతవార్త;**


ప్రభాకర్ రెడ్డిని సన్మానిస్తున్న ఎంపి మల్లు రవి

తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డిని సోమవారం నాడు నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి శాలువాతో ఘనంగా సన్మానించారు. గత జూన్ నెల మొత్తం మహనీయుల ప్రచార రథయాత్ర పేరుతో నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలో బస్సు యాత్ర నిర్వహించడంతో బస్సును ఏర్పాటు చేసిన డోకూరి ప్రభాకర్ రెడ్డి నీ సోమవారం నాడు హైదరాబాదులోని ఆయన నివాసంలో శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా మల్లు రవి మాట్లాడుతూ మహనీయుల ప్రచారానికి సొంత ఖర్చులతో బస్సు ఏర్పాటు చేయడం గర్వించదగ్గ పరిణామమని ఆయన కొనియాడారూ.


## 100 శాతం సబ్సిడీపై కంది, పెసర విత్తనాల పంపిణీ..


విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

**దుద్యాల్, జూన్ 6, ప్రభాతవార్త;**

మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు 100 శాతం సబ్సిడీపై కంది, పెసర విత్తనాలను సోమవారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేర్గు వెంకటయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలోని నాలుగు క్లస్టర్లకు ఒక్కో క్లస్టర్‌కు మూడు క్వింటాళ్ల కంది, ఒక క్వింటాల్ పెసర చొప్పున మొత్తం 12 క్వింటాళ్ల కంది, 4 క్వింటాళ్ల పెసర విత్తనాలను ప్రభుత్వం అందజేసిందన్నారు. పప్పు ధాన్యాల సాగును ప్రోత్సహించి రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పప్పు పంటల సాగును విస్తరించాలని సూచించారు.వ్యవసాయ విస్తరణ అధికారులు సంతోష్ నాయక్, శివాణిబాబు, కావ్య మాట్లాడుతూ, ఎల్‌నీనో ప్రభావం దృష్ట్యా రైతులు వర్షపాతం పరిస్థితులను అంచనా వేసుకుని పంటలను సాగు చేయాలని సూచించారు. సాగు చేసిన పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, వ్యవసాయ శాఖ సూచనలను పాటించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ ఖలీల్ పాషా, నాయకులు రమేష్, రాము నాయక్, బసిరెడ్డి, కృష్ణ, నరేష్ గౌడ్, సత్యనారాయణ, రాములు, శ్రీకాంత్, మండల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సమీకృత మండల కార్యాలయాల భవన నిర్మాణ పనులు పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు


భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**దుద్యాల్, జులై 6, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో రూ. 8.70 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న సమీకృత మండల కార్యాలయాల భవన నిర్మాణ పనులను సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేర్గు వెంకటయ్య మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఆధునిక వసతులు, విశాలమైన గదులతో సమీకృత మండల కార్యాలయాల భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులు, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా కొనసాగాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని, మరో రెండు నెలల్లో నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్, డైరెక్టర్ ఖలీల్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కృష్ణ, సత్యం, కుర్షిద్, యూత్ కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్ శ్రీకాంత్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతున్న కార్యకర్తకు ఎమ్మెల్యే పరామర్శ



**తలకొండపల్లి జులై 6, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల పరిధిలోని గట్టుప్పలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త ఏదుల శంకర్ నో సోమవారం నాడు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించారు. ఈనెల 4న మహబూబ్నగర్ జిల్లా పరిధిలోని మిడ్జిల్ మండల కేంద్రంలో నిర్వహించిన సీఎం బహిరంగ సభ లో అపస్మారక స్థితిలో పడిపోయిన ఏదుల శంకర్ చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకొని పరామర్శించి మెరుగైన వైద్యం కోసం డాక్టర్ లతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డ మాట్లాడారు. ఏదుల శంకర్ త్వరలో కోలుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ తలకొండపల్లి మండల మాజీ అధ్యక్షులు గుజ్జుల మహేష్, మచ్చేందరు రాజు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి 9వరకు డిబిఎస్ ఆధ్వర్యంలో శిక్షణ

**తలకొండపల్లి , జులై 6, ప్రభాతవార్త:**

రంగారెడ్డి జిల్లా పరిధిలో డిబిఎస్ ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి 9 వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా డిబి ఎస్ యు కార్యదర్శి జోగు రమేష్ తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు కందుకూరు మండల పరిధిలోని ముచ్చర్లా గేటు సమీపంలోని చల్మారెడ్డి ఫామ్ హౌస్ లో జిల్లాస్థాయి డివిఎంసి కమిటీ సభ్యులకు, సిటిజన్స్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులందరికీ మూడు రోజులుగా శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు ల వివరాలు, సమాచార హక్కు చట్టం, మహిళా రిజర్వేషన్ల అమలు తదితర అంశాలపై జిల్లా స్థాయిలో ఈ శిక్షణ నిర్వహిస్తున్నందున కమిటీ సభ్యులందరూ హాజరుకావాలని ఆయన కోరారు. ఈ శిక్షణా తరగతులకు రాష్ట్రస్థాయి జిల్లా సాయి మేధావులు పాల్గొని వివరించనున్నట్లు ఆయన తెలిపారు.


నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**మేడ్చల్, జులై 6, ప్రభాతవార్త :** మేడ్చల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 1971-1972 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ విద్యాభ్యాస కాలంలో పొందిన అనుభవాలను పంచుకుంటూ, గురువుల మార్గదర్శకత తమ జీవితాల్లో ఎంతగానో ఉపయోగపడిందని పేర్కొన్నారు. నాటి ఉపాధ్యాయులు మల్లారెడ్డితో పాటు పలువురిని ఘనంగా సన్మానించి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో నందారెడ్డి, దేవేందర్‌రెడ్డి, రాజేశ్వర్, మురళీధర్ గుప్త తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న తహసిల్దార్, యంపిడిఓ

## 17 మందికి షాది ముబారక్ చెక్కుల పంపిణీ

**పెద్దేముల్, జులై 6, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న షాది ముబారక్ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం చెక్కులను అందజేయడం సంతోషదాయకమని మండల తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్ అన్నారు. సోమవారం పెద్దేముల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో 17 మంది లబ్ధిదారులకు శాదీ ముబారక్ చెక్కులను తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్, యంపిడిఓ తిరుమల స్వామి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలోని ఆర్థికంగా వెనుకబడిన ముస్లిం కుటుంబాలకు కుమార్తెల వివాహ సమయంలో ఆర్థిక భారం తగ్గించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని అన్నారు. షాది ముబారక్ పథకం ద్వారా లబ్ది పొందుతున్న ప్రతి కుటుంబం సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబం ఈ సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యంఈఓ నర్సింగ్‌రావు, యంపిఓ రతన్‌సింగ్, గ్రామ సర్పంచ్ డిపై నర్సిములు, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు పి.మహిపాల్‌రెడ్డి, టీపీసీసీ మైనార్టీ కన్వీనర్ యండి.రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సభ్యత్వ నమోదు చేస్తున్న పిఆర్‌టియు అధ్యక్ష,కార్యదర్శులు

**ధారూర్, జులై 6, ప్రభాతవార్త:** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ధారూర్ పిఆర్‌టియు శాఖ డిమాండ్ చేసింది. సోమవారం మండలంలోని పలు పాఠశాలల్లో నిర్వహించిన ఆర్థిక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మండల అధ్యక్షులు యం.శ్రీనివాస్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు దక్కాల్సిన వేతన సవరణ సంఘం నివేదిక, ఆరు విడతల కరువు భత్యం వివిధ రకాల బిల్లుల విడుదలలో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో ఉపాధ్యాయులను తప్పుదోవ పట్టిస్తుందని, తక్షణమే వేతన సంఘం నివేదికను తెప్పించి యాభై శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రభుత్వం ప్రకటించినట్లుగా జులై 15 నుంచి అన్ని కార్పోరేట్ ఆసుపత్రులలో ఉపాధ్యాయులకు వైద్య సదుపాయాలను కల్పించాలని కోరారు. ఉపాధ్యాయులపై మధ్యాహ్న భోజన బాధ్యతలను మోపాలని ప్రభుత్వం చేస్తున్న ఆలోచనను వెంటనే విరమించుకోవాలని, ఇటువంటి నిర్ణయాలు ఉపాధ్యాయుల భోజన సమయాన్ని దెబ్బతీస్తాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి కే.మాణిక్యం, గౌరవ అధ్యక్షులు మల్లికార్జున్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు రవిందర్‌రెడ్డి, నర్సిములు, మండల అసోసియేట్ అధ్యక్షులు బి,శ్రీనివాస్, ఉపాధ్యాక్షులు సుధాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు సుందర్శన్, అశోక్, వెంకటేష్‌లతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్లు బాధితులకు అప్పగింత

**దారూర్, జులై 6, ప్రభాతవార్త:** ధారూర్ మండల పరిధిలోని వివిద కారణాల వల్ల పొగొట్టుకున్న మొబైల్ ఫోన్లను ధారూర్ పోలీసులు సమర్థవంతంగా ట్రాప్ చేసి తిరిగి బాధితులకు సోమవారం అప్పగించారు. ఈ మేరకు ధారూర్ మండలంలోని మెట్లకుంట్లకు చెందిన రాములు, అంపల్లి గ్రామానికి చెందిన కావలి రమేష్, నాగసమందర్ గ్రామానికి చెందిన రుద్రారం నరేష్‌లు తమ ఫోన్లను పొగొట్టుకోగా, బాధితుల ఫిర్యాదు మేరకు స్పందించిన ధారూర్ ఎస్ఐ సున్నం రాఘవేందర్ ప్రత్యేక దృష్టి సారించి సాంకేతిక పరిజ్ఞానంతో ఆఫోన్లను గుర్తించి రికవరి చేశారు. అనంతరం ఎస్ఐ సున్నం రాఘవేందర్ అట్టి ఫోన్లను నేరుగా బాధితులకు అందజేశారు. తమ ఫోన్లు తిరిగి దక్కడంతో బాధితులు హర్షం వ్యక్తంచేస్తు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీ క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.




పోయిన సెల్‌ఫోన్లను తిరిగి అందజేస్తున్న ఎస్ఐ

## ఫార్మసీ విద్యార్థి రాజశేఖర్‌కు పిహెచ్‌డి ప్రధానం

**ఘట్‌కేసర్ రూరల్, జులై 6, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ ఫార్మసీ విద్యార్థి వి. రాజశేఖర్ పిహెచ్‌డి పట్టా పొందినట్లు యూనివర్సిటీ ప్రతినిధులు సోమవారం నాడొక ప్రకటనలో తెలిపారు. రొమ్ము క్యాన్సర్‌లో ఆపోప్టోసిస్ ( కణ మరణం ) ను పెంచే ఎంపికాత్మక కైనేజ్ నిరోధకాలుగా నూతన లాపాటినిబ్ నెరాటినిబ్ హైబ్రిడ్ సమ్మేళనాల నిర్మాణ ఆధారిత రూపకల్పన, కంప్యూటర్ ఆధారిత, స్క్రినింగ్, సంశ్లేషణ, ప్రయోగశాల జంతు నమునాలపై మూల్యాంకన అధ్యయనాలు అనే అంశంపై నిర్వహించిన పరిశోధనకుగాను యూనివర్సిటీ పట్టాను ప్రధానం చేసినట్లు తెలిపారు. పట్టాను పొందిన రాజశేఖర్‌ను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అర్చనా మంత్రి, డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ముత్తారెడ్డి, డీన్ సతీశ్ తదితరులు అభినందించారు.

## బావిలో పడి వ్యక్తి మృతి

**కుల్కచర్ల,జులై 6, ప్రభాతవార్త:** బావిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘట మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామ శివాలరులో చోటు చేసుకుంది.ఎస్ఐ రమేష్ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం కేశంపెట మండలంఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన ఎరుకలి యాదయ్య భార్యతో కలిసి ఎక్లాస్‌ఖాన్‌పేటలో జీవనం కొనసాగిస్తున్నారు. ఈ నెల గురువారం భార్య భర్తల మధ్య చిన్న గొడవ కావడంతో ఇంటి నుండి బయట వచ్చి తిరిగి ఇంటికి వెళ్లకపోవడంతో బంధులు ఇంటికి ఫోన్లు చేసినా సమాచారం లభించలేదు. సోమవారం కుల్కచర్ల మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామ శివరులో ఒ బావిలో శవమై తేలాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టమ్‌కు పంపారు.అనంతరం కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ కుమార్ తెలిపారు.

## ప్రైవేట్ పాఠశాలలో ఫీజు దోపిడీని అరికట్టాలి

**తాండూరు, జులై6,ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని ప్రైవేటు, కార్పోరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడిని అరికట్టాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తాండూరు పట్టణంలోని నారాయణ, శ్రీచైతన్య, మస్టర్‌మైండ్ పాఠశాలలో ఫీజుల దోపిడిని అరికట్టాలని సోమవారం సిఐటియు జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాస్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాస్, ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు చంద్రయ్య, తెలంగాణ మైనార్టీ హక్కుల పోరాట సమితి తాండూరు ఇంచార్జ్ ఎండి సాధిక్ తదితరులు తాండూరు మండల విద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రైవేట్, కార్పోరేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, విద్యార్థుల యూనిఫామ్స్, బ్యాగులు, పుస్తకాలు ఎంఆర్‌పి ధరల కంటే అత్యధిక రేట్లకు అమ్ముతూ తల్లిదండ్రులను, విద్యార్థులను మోసం చేస్తున్నారని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ట్రాఫిక్ సిబ్బందికి రెటినోవా ఫౌండేషన్ చేయూత

**జవహర్‌నగర్, జులై 6, ప్రభాతవార్త:**

జవహర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో, రెటినోవా ఫౌండేషన్ సహకారంతో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక హెల్త్ క్యాంపు నిర్వహించారు. రోడ్లపై నిత్యం విధులు నిర్వహిస్తూ కాలుష్యం, దుమ్ము, ఎండ, వర్షం వంటి ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సిబ్బందికి ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగినది. మల్కాజిగిరి ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె. రాహుల్ రెడ్డి, ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎసిపి సుబ్బయ్య పాల్గొని మాట్లాడారు. ప్రజల భద్రత కోసం నిరంతరం రహదారులపై సేవలందిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది వాహనాల పొగ, దుమ్ము, శబ్ద కాలుష్యం, వాతావరణ మార్పుల ప్రభావానికి అధికంగా గురవుతుంటారని తెలిపారు. దీని కారణంగా కంటి సమస్యలు, శ్వాసకోశ ఇబ్బందులు, మోకాళ్ల నొప్పులు, వెన్నునొప్పి, దంత సమస్యలు, అలసట వంటి అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో సిబ్బంది ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి, అవసరమైన వైద్య సలహాలు అందించేందుకు రెటినోవా ఫౌండేషన్ సహకారంతో హెల్త్ క్యాంపు నిర్వహించినట్లు పేర్కొన్నారు.




శిబిరంలో ట్రాఫిక్ సిబ్బందికి కంటి పరీక్షలతో పాటు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వైద్యులు పలు సూచనలు చేశారు. సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించగలరని ఏసీపీ సుబ్బయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ శివశంకర్, వైద్య బృందం సభ్యులు, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీలో డిఎల్‌పిఓ ఆకస్మిక తనిఖీ



పర్యటిస్తున్న డిఎల్‌పిఒ వరలక్ష్మి

**-రికార్డులు, పాఠశాలలు, మధ్యాహ్న భోజన పథకం అమలుపై సమగ్ర పరిశీలన**

**కొత్తూరు, జులై 6, ప్రభాతవార్త:** కొత్తూరు మండలంలోని పెంజర్ల గ్రామపంచాయతీలో జిల్లా పంచాయతీ అధికారి (డిఎల్‌పిఒ) వరలక్ష్మి సోమవారం ఆకస్మికంగా పర్యటించి గ్రామపంచాయతీ పరిపాలన, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న రికార్డులు, పాలనా విధానం, మౌలిక సదుపాయాల పరిస్థితిని పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థుల హాజరు, పరిశుభ్రత, తరగతి గదుల నిర్వహణ, తాగునీటి సౌకర్యాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, ఆహార నాణ్యత, వంటశాల పరిశుభ్రతను స్వయంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణాన్ని నిరంతరం కొనసాగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామపంచాయతీ కార్యాలయానికి విచ్చేసిన డిఎల్‌పిఒ వరలక్ష్మి మని సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ శాలువాతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గౌస్, ఉప సర్పంచ్ శాంతన్ రెడ్డి, వార్డు సభ్యులు కే. వేదాంత చారి, అర్బాస్, ఆర్. రాములు, కె. మైబుజ్జి, మంద మాధవి, కాటం రమాదేవి, డీలర్ రాజేందర్ రెడ్డి, దేశాల జైపాల్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యం



శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్,సర్పంచ్,ఇతర నేతలు

**శంషాబాద్ జులై6,ప్రభాతవార్త :** నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.సోమవారం హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో శంషాబాద్ మండలంలో చేపట్టిన సిసి మరియు బిటి రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాచారం, చౌదర్ గూడా మరియు పాల్మకూల్ గ్రామాలలో సుమారు రూ. 7.50 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు ప్రజాప్రతినిధులు హెచ్‌ఎండిఏ అధికారులు ప్రజలు పాల్గొన్నారు .

## కాంగ్రెస్‌తోనే సమగ్ర అభివృద్ధి .. మోటే శ్రీశైలం


**యాచారం, జులై 6, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సమగ్ర అభివృద్ధి కి కృషి జరుగుతుందని యాచారం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ఎంపీటీసీ మోటే శ్రీశైలం అన్నారు. సోమవారం యాచారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అర్హులైన నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి అని గుర్తుచేశారు. ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లోని సుమారు అన్ని గ్రామాల్లో రోడ్లు మౌళిక వసతులకు ప్రత్యేక నిధులు మంజూరు అయి సమగ్ర అభివృద్ధి జరుగుతుందని అన్నారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పడ్డాక నిరుపేదలకు ఇందిర ఇళ్ళు పథకం నిలిచిపోయిందని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మొదలైంది అన్నారు. పక్క ఇంటి నిర్మాణం మానవుని ప్రాథమిక అవసరమని గుర్తు చేశారు. రైతుబంధు పేరుతో కోట్ల రూపాయలు సంపన్నులకు అందజేశారని నేడు కేవలం అర్హులైన నిరుపేద రైతులకు రైతు భరోసా అందజేస్తున్నారని పేర్కొన్నారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి మహబూబ్ నగర్ వెనుకబడిన నల్గొండ ప్రాంతాలన్నీ అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. తెరాస ప్రభుత్వం రెవెన్యూ శాఖలో ధరణితో పేదల రైతులు తీవ్రంగా ఇబ్బందులకు గురి చేసినట్లు దుయ్యబట్టారు ,నేడు భూభారతి తో సామాన్యులకు సేవలు అందుబాటులోకి వచ్చాయని గతంలో లక్షల ఖర్చు చేసిన జరగని భూమి రెవెన్యూ పనులన్నీ సాఫీగా సాగుతున్నాయి అన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేసి ప్రైవేటుకు దీటుగా విద్యాసంస్థలను పునర్నిర్మానం చేస్తున్నట్లు గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాలలోని ఆరోగ్య ఉప కేంద్రాలను ప్రాథమిక కేంద్రాలుగా ఉన్నత స్థాయి పెరిగాయని నిధులు మంజూరు అవుతున్నాయని తెలియజేశారు. సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అర్హులైన లబ్ధిదారులకే అందజేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర భారత్ భవిష్యత్ నగరం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉపాధి అవకాశాలు అద్భుతంగా ఉంటాయని అన్నారు.

# బాధితురాలికి సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు పంపిణీ

**శామీర్‌పేట, జులై 6, ప్రభాతవార్త:**

జగ్గంగూడ గ్రామానికి చెందిన బాధితురాలు కొమ్ము ప్రేమిలకు సిఎం రిలీఫ్‌ఫండ్ (ఆర్థిక సహాయం) చెక్కు మంజూరు కావటంతో జగ్గంగూడ కౌన్సిలర్లు సిహెచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, జి.జంగారెడ్డిలు ఆ చెక్కును ఆమెకు అందజేశారు. సోమవారం మూడుచింతలపల్లి మున్సిపాల్టీ పరిధిలోని జగ్గంగూడలో సిఎం రిలీఫ్‌ఫండ్ ఆర్థిక సహాయం 60వేల రూపాయలు మంజూరు కావటంతో చెక్కును వారు ఆమెకు అందజేశారు. మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి సహకారంతో సిఎం రిలీఫ్‌ఫండ్ ఆర్థిక సహాయం అందినట్లు కౌన్సిలర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, జంగారెడ్డిలు తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందే విధంగా కృషి చేసిన మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి వారు దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్లు సిహెచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, 14వ వార్డు కౌన్సిలర్ గూడ జంగారెడ్డి, బిఆర్‌ఎస్ మండల నాయకులు టి.అనిల్‌రెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, శ్రీనివాస్, రాజుగౌడ్, దశరథ, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



జగ్గంగూడలో బాధితురాలు కొమ్ము ప్రేమీలకు సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేసిన కౌన్సిలర్లు సిహెచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, జి.జంగారెడ్డిల దృశ్యం

# ఒక్క సిసి కెమెరా వంద మందితో సమానం

**- నేరాల నియంత్రణలోపనిచేస్తుంది: మల్కాజ్‌గిరి సీపీ సుమతి**

**- పోలీస్ కమిషనరేట్ పరిధిలో లక్షా సీసీ కెమెరాల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నాం: సీపీ**

**ఘట్‌కేసర్ రూరల్, జులై 6, ప్రభాతవార్త:** నేరాల నియంత్రణలో ఒక్క సీసీ కెమెరా వంద మందితో సమానమని

మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి అన్నారు. పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపల్లి డబుల్‌బెడ్రూం గృహ సముదాయం నందు సోమవారం మీ సురక్ష నేను సైతం కార్యక్రమంలో భాగంగా సీపీ సుమతి చేతుల మీదుగా సీసీ కెమెరాల ప్రారంభోత్సవం జరిగింది. సీసీ కెమెరాలు ప్రారంభించిన అనంతరం జరిగిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ ప్రతి కాలనీతో పాటు ప్రతి ఇంటిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాల నియంత్రణకు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. శాంతి భద్రతల నియంత్రణలో సీసీ కెమెరాలు ఎంతగానో తోడ్పటునందిస్తున్నాయని అన్నారు. తమ ఇంటివద్ద ఏర్పాటు చేసుకునే సీసీ కెమెరాలు అందరికీ ఉపయోగపడే విధంగా రోడ్డులో రాకపోకలు రికార్డు అయ్యే విధంగా ఏర్పాటు చేయాలని అన్నారు. ఎద్దైన శాంతి భద్రతకు విఘాతం కల్గినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి శాంతి భద్రత నియంత్రణలో ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలని కోరారు. కమిషనరేట్ పరిధిలో లక్షా కెమెరాలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒక్కరోజే మూడు వేల కెమెరాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీ సురేశ్ కుమార్, అడిషనల్ డీసీపీ వెంకట రమణ, ఏసీపీ మోహన్, పోచారం సీఐ కనకయ్య గౌడ్, ఘట్‌కేసర్ సీఐ బాలస్వామి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపల్లి డబుల్ బెడ్రూం కాలనీలో సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి.



విద్యార్థులు పుస్తకాలు అందజేస్తున్న నాయకులు,ఉపాధ్యాయులు

## విద్యతోనే జీవితానికి బంగారు భవిష్యత్తు

**-చిన్నారి విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమం**

**కేశంపేట, జులై 6, ప్రభాతవార్త:** కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డి పల్లి గ్రామంలో విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా చిన్నారి విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి నిర్వహించారు. గ్రామంలోని జడ్పిహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ప్రాథమిక పాఠశాలలో చిన్నారి విద్యార్థులు నూతనంగా అడుగుపెడుతున్న చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఆనంద్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. అనంతరం సర్పంచ్ పల్లెఆనంద్ కుమార్ మాట్లాడుతూ విద్యను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని, తల్లిదండ్రులు పిల్లలను ప్రతిరోజూ పాఠశాలకు పంపించి వారి భవిష్యత్తు బంగారంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఉపాధ్యాయులు చిన్నారులకు అక్షరాలు దిద్దించి విద్యా జీవితానికి శ్రీకారం చుట్టించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు,తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు ఆకాంక్షి ంచారు.

## మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

**కేశంపేట, జులై 6, ప్రభాతవార్త:**

కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డి గూడ గ్రామానికి చెందిన పోలమోని నరసింహ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు, విషయం తెలుసుకున్న కేశంపేట మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ 5000 వేల రూపాయలు, గ్రామ సర్పంచ్ శశిరేఖ యాదయ్య 5000 వేల రూపాయలను మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు . ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మా కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని ఆర్థిక సహాయం అందించిన మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డికి మరియు గ్రామ సర్పంచ్ శశిరేఖ యాదయ్యలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బాధితుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్,నాయకులు



ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు నూతన వస్త్రసాలను అందజేస్తున్న నాయకులు

## చిగురించిన చిరకాల స్వప్నం

**జిల్లెడు చౌదరిగూడ,జులై6,ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ ఇళ్లతో పేద ప్రజల చిరకాల స్వప్నం చిగురించి నట్లైందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. సోమ వారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఎల్కగూడ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి శుభా కాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం పనిచేస్తుందని అన్నారు. గ్రామాల్లోని అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అర్హులకు అందించేందుకు ఎంతో కృషి చేస్తున్నట్లు వివరించారు. అనంతరం కాస్లాబాద్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల స్లాబు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట నరసింహ రెడ్డి, తాలూకా మహిళా అధ్యక్షురాలు రజిత వెంకటయ్య ,మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు జక్కని రవి,సర్పంచ్ చందు నాయక్, కృష్ణారెడ్డి, ఆంజనేయులు, గోబ్రానాయక్,మాజీ ఎంపీటీసీ సత్య నారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మాభూములను కాపాడి న్యాయం చేయండి

**పూడూరు, జులై6,ప్రభాతవార్త :** మాభూములను కాపాడి మాకు న్యాయం చేయండి సారూ అని కోరుతూ సోమవారం హైద్రాబాద్‌లో ఇందిరాపార్క్ వద్ద సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంభశివరావుకు,కలెక్టర్ కార్యాలయంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీకి పూడూరు గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం మైసమ్మగడ్డ తాండవాసులు ప్రజాదర్బారులో విజ్ఞప్తి చేశారు.అనంతరం బాధిత రైతులు రాంచెరణ్,శ్రీను ,రాజు, హరిశ్చందర్, భీమమ్మ,జమునాబాయి మాట్లాడుతూ పూడూరు గ్రామానికి చెందిన సర్వేనెంబరు 265లో 12-00 ఎకరాల ప్రభుత్వ పోడు భూమిని మాతాత రాజ్యానాయక్‌తో పాటు,మానాన్న జన్యానాయక్‌లు గత 50 సంవత్సరాలుగా కాస్తులో ఉండి పట్టా పాసుపుస్తకం కూడా పొందారాని వివరించారు.

వారి వారసులుగా మేము భీమమ్మ,కె హరిశ్చందర్,శ్రీను,కె రాంచరణ్,కె రాజు,పి జమునా బాయిలము కాస్తులో ఉండి భూమిని చదును చేస్తూ పంటలు పండించి జీవిస్తున్నామని తెలిపారు.ఇట్టి భూమిలో గత కొన్ని సంవత్సరాల కింద బోరుబావితో పాటు,పశువుల షెడ్డును కూడ నిర్మించామని అన్నారు.అయితే గత వారం రోజుల క్రింద అటవీశాఖ అధికారులు వచ్చి ఇట్టి భూమి అటవీశాఖకు చెందిందని,కేసు నమోదు చేస్తామని బెదిరిస్తూ తమను వికారాబాద్ అటవీశాఖ కార్యాలయానికి తీసుకువెళ్లి భూమిలోని షెడ్డుతోపాటు బోరుబావి విద్యుత్తు మోటారును,భూమిలో విత్తిన పంటలనుసైతం ధ్వంసంచేశారని ఆవేధన చెందారు.మా తాత,నాన్నలతోపాటు పూర్వీకుల సమాధులు కూడా ఇక్కడే ఉన్నాయని చెప్పినా వినిపంచుకోకుండా అటవీశాఖ అధికారులు దౌర్జన్యంగా కట్టడాలను కూల్చివేస్తూ మొక్కలను నాటడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.ఈ విషయంపై సిపిఐ నాయకులు సానుకూలత వ్యక్తం చేసినట్లు,తమ కుటుంబాల జీవనాదారమైన భూములను కాపాడుకునే వరకు పోరాటం చేస్తామని తెలిపారు.



# మూడుచింతలపల్లిలో మున్సిపల్ కార్యాలయం భవనాన్ని నిర్మించండి

**శామీర్‌పేట, జులై 6, ప్రభాతవార్త:** మూడుచింతలపల్లి–లక్ష్మాపూర్ గ్రామాల మధ్య ప్రధాన రోడ్డు పక్కన ప్రభుత్వ భూమిలో మూడుచింతలపల్లి మున్సిపల్ కార్యాలయం భవనాన్ని నిర్మించాలని లక్ష్మాపూర్ గ్రామ యువనాయకులు క్యాతం మధుకృష్ణ మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌కు విచ్చేసి జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. మూడుచింతలపల్లి మున్సిపాల్టీ (మండలం) పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలో ప్రధాన రహదారికి అనుకుని ఏర్పాటు చేయటం వల్ల ట్రాఫిక్ రద్దీ, పార్కింగ్ సమస్యలు తగ్గటంతో పాటు ప్రజలు సులభంగ చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. లక్ష్మాపూర్ గ్రామ అభివృద్ధికి, వాణిజ్య కార్యకలాపాల విస్తరణకు, మౌళిక సదుపాయాల మెరుగుదలకు ఇది దోహదపడుతుందన్నారు. దీనికి జిల్లా కలెక్టర్ సానుకూలంగ స్పందించారని, అందుబాటులో ప్రభుత్వ భూమి ఉందో, లేదో పరిశీలించి నివేధిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించటం జరిగిందని మధుకృష్ణ తెలిపారు.

ఆ తరువాత మూడుచింత లపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవిని మర్యాదపూర్వకంగా కలిసి ఇదే అంశంపై ప్రత్యేకంగా వినతిపత్రాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు. ప్రజల ప్రయోజనాలు, భవిషత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎంసి పల్లి–లక్ష్మాపూర్ గ్రామాల మధ్య రహదారి పక్కన మున్సిపల్ కార్యాలయం నిర్మించటానికి ప్రత్యేక చొరవ చూపాలని, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కోరటం జరిగినట్లు క్యాతం మధుకృష్ణ తెలిపారు.



ఎంసిపల్లి-లక్ష్మాపూర్ ప్రధాన రహదారి పక్కన మున్సిపల్ కార్యాలయం భవనం నిర్మించాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరిని కలిసి వినతిపత్రం అందజేసిన లక్ష్మాపూర్ గ్రామ యువనాయకులు క్యాతం మధుకృష్ణ దృశ్యం

# ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి



ఘట్‌కేసర్ సర్కిల్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్‌పై సమీక్ష నిర్వహిస్తున్న ఎంఎంసి కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి

ఘట్‌కేసర్, జులై 6, ప్రభాతవార్త: ఈనెల 31వ తేదీతో ఎల్‌ఆర్‌ఎస్ 25 శాతం రాయితీ ముగియనుండటంతో సిబ్బంది దరఖాస్తు దారులకు సమాచారం ఇవ్వాలని మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ కార్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా అధికారులతో ఎల్‌ఆర్‌ఎస్‌పై సమీక్ష జరిపి పలు సూచనలు చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ ధరఖాస్తులకు సంబంధించి ఎల్1, ఎల్2, ఎల్3 ప్రక్రియని త్వరిత పూర్తి చేసి దరఖాస్తుదారులకు ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసిడింగ్స్‌ను మంజూరు చేయాలని ఆయన ఆదేశించారు. రాయితీ అవకాశాన్ని ప్లాట్ల యాజమానులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. ఈసమావేశంలో చీఫ్ సిటి ప్లానర్ ప్రదీప్‌కుమార్, డిప్యూటి కమిషనర్ అల్లూరి వాణి, సహాయ సిటి ప్లానర్ రాజీవ్‌రెడ్డి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

## డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డికి సన్మానం

**ఘట్‌కేసర్, జులై 6, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమితులైన బొక్క ప్రభాకర్‌రెడ్డి సోమవారం పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు సన్మానించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్‌తో పాటు నాయకులు ప్రభాకర్‌రెడ్డిని శాలువాలు కప్పి సన్మానించి మిఠాయి తినిపించారు. ఘట్‌కేసర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం అందరూ కలిసి పనిచేస్తూ వచ్చే ఎంఎంసీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఆర్‌బిఎస్‌మాజీ సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, మాజీ కౌన్సిలర్ కడపోల్ల మల్లేశ్, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు మీసాల మల్లేశ్, కాంగ్రెస్ మాజీ ప్రధానకార్యదర్శి బర్ల రాధాకృష్ణ, మాజీ వార్డుసభ్యులు కొరుబోతు నాగరాజు, మీసాల సుధాకర్‌రావు, మొత్కుపల్లి శ్రీనివాస్, మేకల సునీల్‌కుమార్, కడపోల్ల రాజు, సుధాకర్, మహంకాళీ, ఓ.విజయ్, తోక మల్లేశ్, శ్రీనివాస్, నరేశ్, సల్మాన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్ తదితరులు



ప్రజావాణిలో వినతిపత్రం అందజేస్తున్న ఇడబ్ల్యుఎస్‌కాలనీ వాసులు

## నీటి, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని వినతి

ఘట్‌కేసర్, జులై 6, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ డివిజన్ ఇడబ్ల్యుఎస్‌కాలనీలో మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కాలనీ అధ్యక్షులు కేశవపట్నం అంజనేయులు, కార్యదర్శి శశధరణ్‌లు సోమవారం ఘట్‌కేసర్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటి కమిషనర్ అల్లూరి వాణికి వినతిపత్రం అందజేశారు. ఇడబ్ల్యుఎస్‌కాలనీలో మిషన్‌భగీరథ నీరు సరఫరా సరిగా లేదని, వాడకం నీరు రాకపోవడం, మిని మోటార్ల వాటర్ పైపుల లీకేజీలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నీటిపైపులైను పగిలిపోయి నీరు రోడ్డుపైప ప్రవహిస్తున్నప్పటికి ఎవరు పట్టించుకోవడం లేదని, పలు వీధుల్లో డ్రైనేజీ మూతలు రోడ్డు మధ్యలో పగిలిపోయాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చామని, వర్షాకాలంలో చెట్లు విరిగి ఇండ్లపైన పడి ఇండ్లు దెబ్బతిన్నాయని ప్రజలకు నష్టం జరుగుతుందని తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను, కూలిపోయే చెట్లను తొలగించాలని, కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అంజనేయులు, శశిధరణ్, రాధాకృష్ణలు డీసీ వాణిని కోరారు.



### ఎస్‌ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన కొలన్ శ్రీనివాస్ రెడ్డి

**నిజాంపేట్, జులై 6, ప్రభాతవార్త**

నిజాంపేట్ ఫేజ్1లో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్య క్రమాన్ని కాంగ్రెస్ సీని యర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి సోమవారం పరి శీలించారు. కార్యక్రమం నిర్వహణ, ఓటరు నమోదు ప్రక్రియపై సమీక్ష నిర్వహించి, సంబంధిత సిబ్బందికి పలు సూ చనలు చేశారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పార దర్శకంగా, వేగవంతంగా కొనసాగాలని, ప్రతి అర్హుడైన ఓటరు తన ఓటు హక్కును నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివరాలను సరిచూ సుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్ర మంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రావూరు మౌళేశ్వరరావు, కాంగ్రెస్ నాయ కులు సత్యప్రసాద్, ఫిలిప్స్, దినేష్, శ్రీనివాసులు, వెంకట్రావు, కృష్ణ, యా దగిరి, కృష్ణాగౌడ్, ధర్మారావు, రవి, అప్పారావు, వెంకటేష్, విజయ కుమార్, అశోక్, కిట్టు, వెంకటేష్, రమేష్, నగేన్‌తో పాటు ఫేజ్1 వాసులు పాల్గొన్నారు.





### పర్యావరణ, అటవీ శాఖల బలోపేతానికి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి: మంత్రి కొండా సురేఖ

**జూబ్లీహిల్స్, జులై 6, ప్రభాతవార్తః**

పర్యావరణ, అటవీ శాఖలను మ రింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందు కు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నూతన ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామ య్యార్‌కు సూచించారు. ఇటీవల అటవీ, పర్యావరణ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన శైలజా రామయ్యర్ సోమవారం జూబ్లీహిల్స్‌లోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఆమెకు మంత్రి శుభాకాం క్షలు తెలిపారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా పర్యావరణ పరిరక్షణ, వన మహోత్సవం, వన్యప్రాణులు, జీవవైవిధ్య సంరక్షణ, అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అడవుల సంరక్షణ వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాల ని మంత్రి సూచించారు. శైలజా రామయ్యర్ నాయకత్వంలో శాఖలు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షి ంచారు.

ఈ సందర్భంగా అటవీ, పర్యావరణ శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న పలు కార్యక్రమాలపై మంత్రి కొండా సురేఖ, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మధ్య సంక్షి ప్తంగా చర్చ జరిగింది.

## సమస్యలతో ప్రజలు ఇబ్బందులు

**-పట్టించుకోని ఎమ్మెల్యే ,అధికారులు**

**అత్తాపూర్, జులై6 ,ప్రభాతవార్త :** మైలార్‌దేవ్‌పల్లి ,కాటేదాన్ డివిజన్‌లలో ప్రజలు సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాటేదాన్ డివిజన్ బిఆర్‌ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ పేర్కొన్నారు. సోమవారం బస్తీబాట కార్యక్రమంలో భాగంగా కాటేదాన్ డివిజన్ బాబుల్ రెడ్డి నగర్‌లో డివిజన్ బిఆర్‌ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ పర్యటించారు. ఈ సందర్భంగా అడుగడుగున ప్రజలు వారి సమస్యలను వెంకటేష్‌కి అభ్యర్థించారు.

ఈ సందర్భంగా కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ మాట్లాడుతూ..కనీసం స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రజాపాలన అని చెప్పుకుంటున్న ప్రభుత్వం అభివృద్ధి మా లక్ష్య ్యమని తిరుగుతున్న నాయకులు ఎమ్మెల్యే నివాసానికి కూతవేటు దూరంలో ఉన్న పలు కాలనీలలో ఎందుకు అభివృద్ధి జరుగుతా లేదో అర్థమవుతలేదదని పెద్ద పెద్ద పూలదండలు శాలువాలు రోడ్డు పొడవున స్వాగతం పలుకుతు భజనలు చేసే పెద్దలు నివసించే కాలనీలో మాత్రమే అభివృద్ధి చేస్తు న్నారు.

పేదలు నివసించే కాటేదాన్ డివిజన్ , మైలార్ దేవ్ పల్లి డివిజన్ లపై చిన్న చూపు చూస్తున్నారని మండిపడ్డారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరారు.


ఈ కార్యక్రమంలో ఉప్పల్ శ్రీను సింహాద్రి ఆర్ కుమార్ ప్రకాష్ బొంబాయి రవి నవీన్ సూరి కార్తీక్ శ్రీను అశోక్ నాని మహేందర్ అ ఖిల్ రామస్వామి మోహన్ వెంకటరమణ అనిల్ సంతోష్ మురళి శేఖర్ కిరణ్ లక్ష్మణ్ వెంకటేష్ మరియు పెద్ద ఎత్తున బి ఆర్‌ఎస్ నాయకులు మహిళా నాయకురాలు కార్యకర్తలు పాల్గొన్నారు .

## నేడు కరెంట్ లేని ప్రాంతాలు..

**బేగంబజార్,జులై 6,ప్రభాతవార్త:** బేగంబజార్ డివిజన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ మరమ్మత్తుల కారణంగామంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు బేగంబజార్ డివిజనల్ ఇంజనీర్ అన్నయ్య తెలిపారు.దూల్‌పేట్ 11 కెవి విద్యుత్ యుజి,11 కెవి మహలక్ష్మినగర్ ఫీడర్ పరిధిలోని ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12గంటల 30 నిమిషాల వరకు మినిస్టేడియం,బాల్‌రాం గల్లీ,దూల్‌పేట్, మహాలక్ష్మినగర్, శివలాల్‌నగర్, కుమ్మరివాడి,మార్వాడి బస్తీ,దూల్‌పేట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారన్నారు.జాలి హన్‌మాన్ 11 కెవి ఫీడర్,11 కె.వి పురానాపూల్‌ఫీడర్ మరమ్మత్తుల కారణంగా మధ్యాహ్నం 2గంటల 30 నిమిషాల నుంచి సాయంత్రం 5గంటల 30నిమిషాల వరకు జాలిహన్‌మాన్,బడిగల్లీ,మహంకాళీ టెంపుల్,జుంగురుబస్తీ,సీత్లామాత టెంపుల్,హెచ్‌పిపెట్రోల్ పంపు, లేబర్ అడ్డా,ఊర్‌వాడి,సేవాదల్ తదితర ప్రాంతాలల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డివిజనల్ ఇంజనీర్ అన్నయ్య తెలిపారు.

# మున్సిపాల్టీ అభివృద్ధికి నిధులివ్వండి

**శామీర్‌పేట,జులై 6, ప్రభాతవార్త:** శామీర్‌పేట ఉమ్మడి మండలానికి శివారు ప్రాంతం సిద్దిపేట్ జిల్లా కర్కపట్లలోని బయోటెక్ పార్కుల్లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు డి.శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలను అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి మర్యాద పూర్వకంగా వెళ్లి కలిశారు. సోమవారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ మున్సిపాల్టీ ప్రాంతం మీదుగా సిద్దిపేట్ జిల్లా కర్కపట్ల గ్రామంలోని బయోటెక్ పార్కులో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు డి.శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు వెళ్లగా అదే కాన్వాయ్ వెంట అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డితో పాటు పలువురు నాయకులు వెళ్లి వారిని కర్కపట్లలోని బయోటెక్ పార్కులో జరిగిన కార్యక్రమంలో వారిని కలిశారు. అలియాబాద్ కొత్తగా మున్సిపాల్టీగ ఏర్పడినందున అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబును, అదే విధంగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి కోరారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు కంటం కృష్ణారెడ్డి, బి.నవీన్‌రెడ్డితో పాటు నాయకులు భాను పలువురు నాయకులు నాయకులు పాల్గొన్నారు.



రాష్ట్ర మంత్రులు డి.శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిసిన అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి దృశ్యం

## దేవరయాంజాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో
# హౌజ్ లీడర్స్‌కు బ్లేజర్లు, బ్యాడ్జీలు పంపిణీ

**..ప్రభుత్వ ఆదేశాల మేరకు హౌస్ కమిటీలు, విద్యార్థి కమిటీలకు విద్యార్థి నాయకుల ఎంపిక**

**శామీర్‌పేట, జులై 6, ప్రభాతవార్త:** దేవరయాంజాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులలో ఎంపికైన హౌజ్ లీడర్లకు బ్లేజర్లు, బ్యాడ్జీలను మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, ఆ పాఠశాల కమిటీ చైర్మన్ కట్ట మీనాకుమారి, ప్రధానో పాధ్యాయులు బాలేశ్‌లు అందజేశారు. సోమవారం శామీర్‌పేట డివిజన్ పరిధిలోని దేవరయాంజాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు హౌజ్ లీడర్లను, విద్యార్థి కమిటీలకు నాయకులను ఎంపిక చేసుకోవటం జరిగింది. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కట్ట మీనాకుమారి, హెచ్‌ఎం బాలేశ్‌ల ఆధ్వర్యంలో జరిగింది. ఎంపికైన హౌజ్ లీడర్లను, విద్యార్థి కమిటీల నాయకులను వారు అభినందించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొం దించుకుని క్రమశిక్షణ, బాధ్యతతో తమ విధులను నిర్వహిస్తూ పాఠశాలకు మంచి పేరు తీసుకరావాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




దేవరయాంజాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హౌస్‌లీడర్లకు బ్లేజర్లు, బ్యాడ్జీలను అందజేసిన జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ కట్ట మీనాకుమారిల దృశ్యం

# జాతిసేవలో శ్యామాప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయం

**ఘట్‌కేసర్, జులై 6, ప్రభాతవార్త:** భారతీయ విలువలకు పెద్దపీట వేసి సాంప్రదాయ ఆలోచనలకు వ్యవస్థ రూపమిచ్చారని బిజెపి ఘట్‌కేసర్ డివిజన్ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ డివిజన్ శివారెడ్డిగూడలో సోమవారం భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ 125వ జయంతిని నిర్వహించారు. మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు ముఖర్జీ చిత్రపటానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ దేశ తొలి పరిశ్రమలు, పౌరసరఫరాలశాఖ మంత్రిగా పనిచేసి దేశప్రగతికి ఎనలేని సేవలందించారని కొనియాడారు. గొప్ప రాజనీతిజ్ఞుడిగా, అసాధారణ నిజాయితీ, మానవతా దృక్పథం కల్గిన నాయకుడిగా ముఖర్జీ పేరుగాంచారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు కంభం లక్ష్మారెడ్డి, పల్లె మదుసూధన్‌గౌడ్, ఘట్‌కేసర్ డివిజన్ ఉపాధ్యక్షులు గుండ్ల రామతీర్థ, ప్రధాన కార్యదర్శి చెల్లక శ్రీధర్, కోశాధికారి మెడబోయిన నరేశ్, బిజెవైఎం అధ్యక్షులు కొమ్మిడి విక్రాంత్‌రెడ్డి, కిసాన్‌మోర్చ అధ్యక్షులు కట్ట మధుసూధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గొల్ల సురేంద్ర, బండ్లగూడెం కిషోర్‌కుమార్‌గౌడ్, కొమ్మిడి జైపాల్‌రెడ్డి, మంగు శ్రీనివాస్, బూత్ అధ్యక్షులు దీపక్‌వ్యాస్ తదితరులు పాల్గొన్నారు.



శివారెడ్డిగూడలో శ్యామాప్రసాద్ ముఖర్జీకి నివాళులు అర్పిస్తున్న బిజెపి నాయకులు

# వికారాబాద్‌లో జగ్గీవన్‌రామ్ వర్ధంతి వేడుకలు



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పిస్తున్న నాయకులు

**వికారాబాద్,ప్రభాతవార్త :** భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్థంతి కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షులు పి.ఆనంద్ మాదిగ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని జగ్గీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అణగారిన కులంలో ఒక కుగ్రామంలో జన్మించి, విద్యార్థి నాయకునిగా రాజకీయ నాయకునిగా ఎదిగారని అన్నారు. స్వాతంత్ర్యానంతరం మంత్రిగా పనిచేసిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ప్రయాణం ఈ దేశంలో మనం కొలుస్తున్న మహానీయులలో అత్యంత ఎక్కువ కాలం దేశానికి సేవలు అందించిన ఏకైక వ్యక్తి అన్నారు. రక్షణ మంత్రిగా ఉండి బంగ్లాదేశ్ విముక్తి ప్రదాతగా నిలిచి బంగ్లాదేశ్ దేవుడు లాగా కొలిచే వ్యక్తిగా వాళ్ళ మన్ననలు పొందిన వ్యక్తి జగ్జీవన్ రామ్ అని కొనియాడారు.

ఎన్నో కార్మిక చట్టాలు ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ కాలం పార్లమెంట్ సభ్యునిగా పనిచేసిన మొదటి వ్యక్తి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మహనీయుల ఉత్సవ కమిటీ సభ్యులు టి.రాంచందర్, సి.జగదీష్, తిమ్మని శంకర్, పి.ఆనంద్, మంచన్ పల్లి సురేష్,బి.రవీందర్, వై.గీత,పుష్పరాణి, ఏ.ఆనంద్, మయూర్ సర్సర్, బిజెపి అనిల్ యాదవ్, సురేందర్, శామ్ రెడ్డి, న్యాయవాది అక్కం మోహన్ ఆర్. రాకేష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## 15న ఆర్‌పిఐ అధ్యక్షుడు రాందాస అతెవాల్ రాక

**సైఫాబాద్, జులై 6 ప్రభాతవార్త:**

రాష్ట్రంలో పార్టీ పటిష్టత కోసం కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండి యా జాతీయ అధ్యక్షుడు రాందాస అతెవాల్ ఈ నెల 15న హైదరాబా ద్ నగరానికి రానున్నారని ఆర్‌పిఐ జాతీయ కార్యదర్శి, తెలుగు రాష్ట్రా ల ఇంచార్జి పేరం శివనాగేశ్వర్‌రావు చెప్పారు. ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యకర్తల సమావేశంలో 15వ తేదీన జరుగుతుందని, పార్టీ విస్తరణ, సంస్థాగత బలోపేతం, సభ్యత్వం నమోదు తదితర కార్యక్రమాలపై సభలో దిశా నిర్దేశం చేయనున్నారని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్యకర్తలు, నాయకులు, యువజన ప్రతినిధులు పెద్ద ఎత్తున పా ల్గొంటారని, రానున్న సంస్థాగత ఎన్నికలు, నిర్మాణం, సామాజిక న్యాయం తదితర అంశాలపై కూడా కేంద్ర మంత్రి సందేశాన్ని ఇస్తారన్నారు. ఈ సభను విజయవంతం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు రత్న ప్రసాద్, మేడి సతీష్‌కుమార్, రవికుమార్, సచిన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నా రు. అంతకు ముందు వీరు డా.బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని బషీర్‌బాగ్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళలు అర్పించారు.



సమావేశంలో మాట్లాతున్న పేరం శివనాగేశ్వర్‌రావుగౌడ్

### తెలుగుదేశం పార్టీని తిరుగులేని రాజకీయ శక్తిగా మార్చటమే లక్ష్యం

**ముషీరాబాద్, జులై 6, ప్రభాతవార్త:** తెలంగాణలో తెలుగుదేశం పార్టీని తిరుగులేని ఒక రాజకీయ శక్తిగా మార్చటమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని టీడీపీ రాష్ట్ర నాయకు లు శ్రీపతి సతీష్, పోలపల్లి అశోక్‌లు పిలుపునిచ్చారు. సోమవారం టీడీపీ నగర కార్యాల యంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నాయకులు నల్లెల్ల కిషోర్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పార్లమెంట్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా సతీష్, అశోక్‌లు హాజరై మాట్లాడుతూ రాబోయే ఎన్నికలకు సమాయత్తం కోసం పార్టీలో నాయకులంతా సమిష్టిగా పనిచేస్తూ డివిజన్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసేదిశగా ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని కోరారు. ఈనెల 9వ తేదీ ప్రారంభం కానున్న తెలుగుదేశం ప్రజాపథం కార్యక్రమం మొదటగా ముషీరాబాద్ నియోజకవర్గం, చిక్కడపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద నిర్వహించబడుతుందని తెలిపారు.నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్‌లు మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ ప్రారంభమయ్యే తెలుగుదేశం ప్రజాప థం కార్యక్రమం రెండు రోజులకు ఒక్కో డివిజన్ ప్రకారం సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని మొత్తం 38 డివిజన్‌లపై ప్రత్యేక దృష్టి సారించి, పార్టీని బలోపేతం చేయటమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాబోయే రోజుల్లో రాజకీయ పొత్తు కుదిరితే, రాష్ట్రంలో పార్టీని ప్రథమ స్థానంలో నిలబెట్టుకుందామని పిలుపునిచ్చారు.

### తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోండి : బండి రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, జులై 6, ప్రభాతవార్త**

కూకట్‌పల్లి నియోజకవర్గంలో గల కాలనీలతోపాటు మురికివాడల్లో సైతం తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా తగు చర్యలు తీసు కోవాలని టిపిసిసి ఉపాధ్యక్షుడు తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ అధికారుల కు సూచించారు. ఈ మేరకు ఆయన స్థానిక నాయకులతో కలిసి సోమవారం కెపిహెచ్‌బి వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) హరి శంకర్‌ను కలిశారు. వాటర్ వర్క్స్ పరిధిలోకి వచ్చే సఫ్దర్ నగర్, దీన్ దయాళ్ నగర్, మోతి నగర్ 15వ ఫేస్‌లలో కొత్తగా డ్రైనేజీ లైన్ల నిర్మాణం మోతి నగర్‌లో వాటర్ సంపు నిర్మించాలని బండిరమేష్ సూచించారు. మురికి వాడల్లో 20 వేల లీటర్ల ఉచిత త్రాగునీరును అందించాలని కోరా రు.కార్యక్రమంలో అధికారులు డీజీఎం లు త్రినాథరావు, చంద్రశే ఖర్, లక్ష్మయ్య, తూము వేణు, సతీష్ రెడ్డి, కృష్ణ రాజ్ పుత్, రాజేష్,మైఖేల్, ఫణి కుమార్, రజిత, వనజ, మాధవి పాల్గొన్నారు.

### ఎస్‌ఐఆర్ ప్రక్రియలో ప్రతి అర్హుడూ భాగస్వామి కావాలి

**- ఎమ్మెల్యే దానం నాగేందం**

**జూబ్లీహిల్స్, జులై 6, ప్రభాతవార్తః**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియలో ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా పాల్గొని తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి దానం నాగేందర్ పిలుపునిచ్చారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని జూబ్లీహిల్స్ డివిజన్, ఫిలింనగర్ పరిధిలోని భగత్‌సింగ్ కాలనీలో నిర్వహించిన ఎస్‌ఐఆర్ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలు ఎలాంటి అపోహలకు తావివ్వకుండా ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అవసరమైన పత్రాలను సమర్పించి ఓటరు జాబితాలో తమ పేర్లు సక్రమంగా నమోదు అయ్యేలా చూసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యం లో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మా మిడి నర్సింగ్‌రావు, జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు కాటూరి రమే ష్, గుంటి నగేష్, సాగర్, ఆకుల రాజు, అబ్దుల్ గని, సహదేవ్, నడిమింటి కృష్ణ, గౌస్‌బాయి, సంపంగి కిరణ్, పద్మ, దానమ్మ, మల్లేశ్వరమ్మ, చంద్రమ్మ తదితర నాయకులు పాల్గొన్నారు.